పంపకాలు.. ఎవరికి ఎన్ని?

- జోరుగా నగదు పంపిణీ
- క్రాస్ ఓటింగ్‌పై మండలంలో ప్రధాన పార్టీల దృష్టి

రఘునాథపాలెం: ఖమ్మం నియోజకవర్గంలో ఉన్న ఏకైక మండలం రఘునాథపాలెంలోని ఓటర్ల తీర్పుపైనే ప్రధాన పార్టీల అభ్యర్థుల గెలుపు ఆధారపడి ఉందని సర్వత్రా చర్చలు సాగుతున్నాయి. మండలంలో 37 గ్రామ పంచాయతీల్లో 39,029 మంది ఓటర్లు ఉండగా.. అత్యధికంగా గిరిజనులు ఉన్నారు. ఈ ప్రాంతంలో అధిక మెజార్టీ సాధిస్తే గెలుపు ఖాయమని భావించి ఓటర్లను ఆకర్షించే పనిలో పడ్డారు. అందుకు గ్రామంలో పార్టీల కతీతంగా ప్రతీ ఒక్క ఓటరుకు ప్రధాన పార్టీలు నగదు అందజేసినట్లు తెలిసింది. గత మూడు రోజులుగా మండల వ్యాప్తంగా పంపకాలతో గ్రామాల్లో సందడి నెలకొంది. ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి సైతం ప్రమాణ పూర్వకంగా ఓటు వేస్తామంటే నాయకులు తాయిలాలు ముట్టచెప్పినట్లు తెలిసింది. మండలంలో తమకు మెజార్టీ వస్తుందని ప్రధాన పార్టీలు అయిన బీఆర్ఎస్, కాంగ్రెస్ గ్రామాల వారీగా లెక్కలు వేస్తున్నారు. అయితే పోలింగ్‌లో మండల ఓటర్లు ఏ విధమైన తీర్పు ఇవ్వనున్నారో వేచిచూడాలి.





ఖమ్మంరూరల్: సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు వస్తున్న ఉద్యోగులు

మీట నొక్కుడే..!

నేటి పోలింగ్‌కు సర్వం సిద్ధం

- ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకే పోలింగ్
- ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు
- ఒక్కో పోలింగ్ కేంద్రం వద్ద ఐదుగురు చొప్పున పోలీస్ బలగాలు
- సీసీ కెమెరాల పర్యవేక్షణతో పాటు వెబ్ క్యాస్టింగ్ ద్వారా కలెక్టరేట్‌కు అనుసంధానం

ఖమ్మంసహకారనగర్/ ఖమ్మంమయూరిసెంటర్/ ఖమ్మంరూరల్: ఎన్నికల ప్రక్రియలో కీలక ఘట్టమైన పోలింగ్ నేడు(గురువారం)జరగనుంది. రెండు నెలలుగా ఎన్నికల సన్నాహాల్లో ఉన్న యంత్రాంగం పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేసింది. మొత్తంగా ఇక మీటర్ బూత్‌లోకి వెళ్లి ఈవీఎం మీట నొక్కడమే తరువాయి అన్నట్లు అధికారులు అన్నీ సిద్ధం చేశారు. ఖమ్మం నియోజకవర్గంలో 32 మంది, పాలేరు నియోజకవర్గంలో 31 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుండగా పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో ఉదయం మాక్ పోలింగ్ నిర్వహించిన అనంతరం నిజమైన పోలింగ్‌ను ప్రారంభించనున్నారు. పటిష్ట బందోబస్తు మధ్య ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంది. ఓటర్లు ఆసక్తిగా ఓట్లు వేసేలా వివిధ రకాల సౌకర్యాలు కల్పించారు.

ఖమ్మం నియోజకవర్గంలో..

ఖమ్మం నగరంలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో పోలింగ్ సిబ్బందికి ఎన్నికల సామగ్రిని ఖమ్మం ఆర్‌ఓ, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి ఆధ్వర్యాన పంపిణీ చేశారు. ఖమ్మం నియోజకవర్గంలో 135 లొకేషన్లలో 355 పోలింగ్ కేంద్రాలకు మొత్తం 30 రూట్లు ఉన్నాయి. 239 పోలింగ్ కేంద్రం మోమినాన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నూతన భవనం, 317 పోలింగ్ కేంద్రం రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాలలోని 146, 156 పోలింగ్ కేంద్రాలను మోడల్ కేంద్రాలుగా అధికారులు ఏర్పాటు చేశారు. కాగా, నగరంలోని 20 లొకేషన్లలో 44 పోలింగ్ కేంద్రాలను క్రిటికల్ పోలింగ్ కేంద్రాలుగా అధికార యంత్రాంగం గుర్తించి అందుకు అనుగుణంగా ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈనేపథ్యాన సెయింట్ జోసెఫ్ పాఠశాలలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సందర్శించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఆదర్శ్‌సురభితో పాటు అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

పాలేరు నియోజకవర్గంలో..

ఖమ్మంరూరల్ మండలంలోని శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాల నుంచి ఆయా కేంద్రాలకు ఎన్నికల సామగ్రితో బయలుదేరి వెళ్లారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో పోలింగ్ అధికారి, అసిస్టెంట్ పోలింగ్ అధికారి, అదనపు పోలింగ్ అధికారితో పాటు ఇద్దరు మైక్రో అబ్జర్వర్లు విధులు నిర్వహించనున్నట్లు ఆర్‌ఓ రాజేశ్వరి తెలిపారు. కాగా, కూసుమంచి మండలంలోని గోరీలపాడుతండాలో స్త్రీలకు ప్రత్యేకంగా ఆదర్శ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయగా.. పాలేరులో దివ్యాంగులకు ఆదర్శ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలను అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ సందర్శించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు చేపట్టాలని ఆదేశించారు.



డ్యూటీలు వేస్తున్న రిటర్నింగ్ అధికారి ఆదర్శ్ సురభి



కూసుమంచి: సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్



పాలేరులోని ఆదర్శ పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన వీల్‌చైర్లు



చంటి పిల్లతో విధులకు వెళ్తున్న మహిళా ఉద్యోగి



ఖమ్మంరూరల్: పోలింగ్ సామగ్రితో వస్తున్న ఉద్యోగులు

నియోజక వర్గాల వారీగా ఓటర్ల వివరాలు..

నియోజకవర్గం	ఓటర్లు	పురుషులు	స్త్రీలు	ఇతరులు
ఖమ్మం	3,22,996మంది	1,67,969	1,54,978	49
పాలేరు	2,36,287మంది	1,14,134	1,22,148	05

పోలింగ్ కేంద్రాల వివరాలు..


నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	సిబ్బంది	బరిలో అభ్యర్థులు	పోలీస్ బలగాలు
ఖమ్మం	355	1,560	32	1,400
పాలేరు	289	1,445	31	1,700

పోలింగ్ కేంద్రాల పరిశీలన



తిరుమలాయపాలెంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ

తిరుమలాయపాలెం: మండలంలోని తిరుమలాయపాలెం, బీసురాజుపల్లితండా, ఎదుళ్లచెరువు, పిండిప్రోలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను మండల ఎస్‌ఐ వరాల శ్రీనివాస్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఈవీఎంల భద్రతను పరిశీలించాక మాట్లాడారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున ప్రజలు గుంపులు గుంపులుగా ఉండొద్దని, మద్యం సేవించి పోలింగ్ కేంద్రాలకు రావద్దని హెచ్చరించారు.



ఏ గడపనూ వదల్లేదు..!

- నకుటుంబ నపరివారంగా ప్రచారం
- అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా విస్తృత పర్యటనలు



ఖమ్మంవన్‌టౌన్: ఎన్నికల్లో ప్రచారం కీలకపాత్ర పోషిస్తుంది. తమ అభ్యర్థి గుణగణాలను తెలుపుతూ, చేయబోయే పనులను చెబుతూ ప్రతీ అభ్యర్థి ప్రచారం నిర్వహిస్తారు. అధికారమే పరమావధిగా పోటీచేసిన ప్రధాన పార్టీల అభ్యర్థులు ఈసారి పడరాని పాట్లు పడ్డారు. తమ వద్ద ఉన్న అస్త్రశస్త్రాలను సంధించి గెలుపే లక్ష్యంగా ముందుకుసాగారు. ఎన్నికలను ఆషామాషీగా తీసుకోకుండా తామే గెలవాలని, ఐదేళ్లపాటు ఉండే అధికారం కోసం నిర్విరామంగా శ్రమించారు. గెలిచేందుకు ఉన్న ప్రతీ అవకాశాన్ని సానుకూలంగా మల్చుకోవడం కోసం ఈసారి కుటుంబసభ్యులందరినీ రంగంలోకి దింపారు.

ఇతర ప్రాంతాల నుంచి వచ్చి..

తమ వారి గెలుపు కోసం అమెరికా, హైదరాబాద్‌తో పాటు దూరప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారు సైతం వచ్చి పట్టణాలు, గ్రామాల్లో విస్తృతస్థాయిలో ప్రచారం నిర్వహించారు. ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు గెలుపుకోసం ఆయన సతీమణి భ్రమరాంబ, తనయుడు యుగంధర్, కోడలు దీప్తిలు ప్రచారం నిర్వహించగా, పువ్వాడ అజయ్‌కుమార్ గెలుపుకోసం సతీమణి వసంతలక్ష్మి, తనయుడు నయన్‌రాజ్‌లు ప్రచారం నిర్వహించారు. అదేవిధంగా పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గెలుపుకోసం ఆయన సతీమణి మాధురి, తనయుడు హర్షారెడ్డి, కుమార్తె స్వప్నిరెడ్డి, సోదరుడు ప్రసాదరెడ్డి, ఆయన సతీమణి శ్రీలక్ష్మి, తనయుడు లోహిత్‌రెడ్డి, మేనల్లుడు దయాకర్‌రెడ్డిలు విస్తృతస్థాయిలో ప్రచారం నిర్వహించగా.. పాలేరు ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి విజయాన్ని కోరుతూ.. ఆయన సతీమణి విజయమ్మ, కుమార్తెలు దీపిక, దీప్తి తదితరులు ప్రచారం చేశారు. సుమారు 20 రోజుల నుంచి వీరు ఎక్కని మెట్టు ఎక్కనీ గడపలేదు. ఈ ప్రచారపర్వానికి తెరపడగా.. వీరి కష్టానికి ఫలితం తేలాలంటే మరో మూడు రోజులు వేచిచూడాల్సిందే.

కాంగ్రెస్‌లో చేరిన మల్లేపల్లి సర్పంచ్



సర్పంచ్ దంపతులతో పొంగులేటి శ్రీనివాసరెడ్డి


కూసుమంచి: మండలంలోని మల్లేపల్లి గ్రామ సర్పంచ్ పొట్టపింజర నాగేశ్వరరావు, కుమారి దంపతులు బుధవారం సీపీఎం నుంచి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వీరికి పార్టీ కండువా కప్పి ఆయన సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని, కాంగ్రెస్ విజయానికి కృషి చేయాలని పొంగులేటి వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు తెల్లమేకల కనకయ్య పాల్గొన్నారు.


కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించండి

ఖమ్మం రాపర్తినగర్: ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్రావు, ఖమ్మం జిల్లా కన్వీనర్ వర్దబోయిన బాబు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఖమ్మంలో జనసమితి ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కుటుంబపాలనకు చరమగీతం పాడే రోజు ఆసన్నమైందని, ఓటరు మహాశయులు విజ్ఞతతో ఆలోచించి తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జంగిపల్లి రవి, పాపారావు, లేళ్ళ నరసింహారావు, బాబు తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనలో పలువురికి గాయాలు

కామేపల్లి: గోవింద్రాల గ్రామానికి చెందిన ఆంగోత్ మంగ్యా, ఆంగోత్ లాలు అనే వ్యక్తులు పాత కక్షల నేపథ్యాన మంగళవారం రాత్రి ఇరు వర్గాల వారు దాడికి పాల్పడ్డారు. దీంతో మంగ్యా, లాలుతో పాటు వారి కుటుంబీలకు గాయాలు కాగా.. ఇరు వర్గాలకు చెందిన బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.





మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824 | రమేష్, ACO - 9059115968
ఖమ్మం ఎన్. ఉపేందర్ - 99591 24151 | మధిర వీరబాబు - 98498 64638
పాలేరు ఎం. రామకృష్ణ - 85220 39990 | సత్తుపల్లి జి. బాబు - 79979 58225
వైరా ఐ. రాందాస్ - 98898 81843 | టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

ఎన్. శేషయ్య - 99121 99148
జి. నర్సింహారెడ్డి - 97054 44181
ఎస్.కె. పాషా - 97054 44182
పి. నందకుమార్ - 90102 99957